సంతలో బాల కార్మికుడు గుర్తింపు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: బాల కార్మిక నిర్మూలన మాసోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని కించమండ వారపు సంతలో అల్లూరి జిల్లా కార్మిక శాఖ జిల్లా ఇన్చార్జి టి.సుజాత ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారపు సంతలో నిర్వహిస్తున్న ప్రతి దుకాణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఓ కిరాణా దుకాణంలో బాల కార్మికుడు పని చేస్తుండగా కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇన్చార్జి సుజాత స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతలో తనిఖీ చేపడతున్న అదికారులు

బాధలు వింటూ.. భరోసా ఇస్తూ...

రెండో రోజు ఉత్సాహంగా సాగిన మహాపాదయాత్ర

పాదయాత్ర బృందానికి తమ సమస్యలు చెబుతున్న మహిళలు

గునపం పట్టి ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రీనివాసరావు

పూలు, హారతులతో స్వాగతం పలుకుతున్న కూళ్లపాడు గ్రామస్తులు

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో చేపట్టిన నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర రెండో రోజు బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. అడుగు అడుగునా హారతులతో పాదయాత్రకు ముంపు గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం మండుటెండను సైతం లెక్క చేయకుండా కొనసాగించింది. మురుమూరు గ్రామంలో 'ఉపాధి హామీ' పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. కూలీలతో కలిసి వి.శ్రీనివాసరావు గునపం పట్టారు. పాదయాత్రకు కాచవరంలో వైసిపి నాయకులు, దూగుట్టులో టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. దూగుట్ట గ్రామంలో ప్రజలతో శ్రీనివాసరావు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాచవరం ఎస్సి కాలనీ వాసులు తమకు వరద ముంపు సమయంలో నిత్యావసరాలు ఇవ్వలేదని పాదయాత్ర దృష్టికి తెచ్చారు. పోలిపాకలో గోదావరి ముంపులో తమ గ్రామం ఉన్నా ముంపులో లేదని అధికారులు చెపుతున్నారని స్థానికులు వాపోయారు. కూళ్లపాడులో ఆ గ్రామానికి చెందిన మడకం లక్ష్మి తన సమస్యలను తెలియజేసింది. గత ఏడాది ముంపునకు గురై తన ఇల్లు పాడైందని, ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించలేదని తెలిపింది. వరదల్లో మునిగి ఉన్న నిర్వాసిత ప్రాంత ప్రజలను వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏనాడూ పట్టించుకోలేదని నాయకులు విమర్శించారు. సిపిఎం మాత్రం ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

పాఠశాలలో చిన్నారులతో శ్రీనివాసరావు

రెండో రోజు పాదయాత్ర సాగింది ఇలా...

రెండో రోజు బుధవారం ఉదయం ఎటపాక మండలం మురుమూరులో ప్రారంభమై కూనవరం మండలంలోకి ప్రవేశించి పోలిపాక, పోచవరం కాలనీ వరకు సాగింది. అక్కడ ఉదయం అల్పాహారం అనంతరం పోచవరం, కాచవరం, దూగుట్ట మీదుగా కూళ్లపాడుకు మధ్యాహ్నం సమయానికి చేరుకుంది. అక్కడ మధ్యాహ్నం భోజనాలు చేశారు. అక్కడ నుండి నర్సింగపేట, పొట్లవాయిగూడెం, కరక గూడెం, కొండాయి గూడెం, గొమ్ముగూడెం జంక్షన్ మీదుగా పల్లూరు వరకు సాగింది. సాయంత్రం అక్కడ ఆవుల నాగమయ్య స్థూపానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం మర్రిగూడెం, చూచిరేవుల గూడెం, భీమవరం, జగ్గవరం, మీదుగా రాత్రికి టేకులబోరు గ్రామానికి చేరింది. అక్కడ రాత్రి భోజనం చేసి బస చేశారు.

కాళ్లకు చెప్పులు లేకుండా 15 కిలో మీటర్ల నడక

సిపిఎం చేపట్టిన పాదయాత్రలో ఓ బాలిక కాళ్లకు చెప్పుల్లేకుండా 15 కిలోమీటర్లు నడిచింది. మంగళవారం ఎటపాక మండలం నెల్లిపాకలో పాదయాత్ర ప్రారంభం కాగా, అక్కడ నుండి తొలిరోజు పాదయాత్ర ముగిసిన మురుమూరు వరకు ఆ బాలిక చెప్పులు లేకుండా నడిచి అందరికీ స్ఫూర్తిగా నిలిచింది.

పాదయాత్రకు సంఘీభావం తెలిపిన వైసిపి కాచవరం నాయకులు

పాదయాత్రకు సంఘీభావం తెలిపిన టిడిపి నాయకులు

41 కాంటూరులో కలపాలని వినతిపత్రం ఇస్తున్న మురుమూరు గ్రామస్తులు

చింతపల్లి సంతలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

పోలవరం పోరుకేక పాదయాత్రకు..

సిపిఎం సంఘీభావ నిధి సేకరణ

ప్రజాశక్తి-పాడేరు: భూములు కోల్పోయిన పోలవరం బాధిత నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలువునా ముంచాయని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. ఈనెల 20 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు 14 రోజులు 400 కిలోమీటర్లు పోలవరం పోరు కేక పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రకు మద్దతుగా బుధవారం చింతపల్లి సంతలో సిపిఎం కార్యకర్తలు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేకరించిన విరాళాలను జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల్లో మునిగిన గ్రామాలన్నింటికీ మొదటి దశ పునరావసంలో కల పాలని, గోదావరి వరదల నుండి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, తప్పులతడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం, మజ్జి రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాంగి జీవన్, కృష్ణ, కార్తీక్ పాల్గొన్నారు.

గర్భిణికి తప్పని అవస్థలు

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని మారుమూల గోమాంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పంచాయతీ పరిధిలో నిండు గర్భిణీని పురిటి నొప్పులతో అవస్థలు పడింది.బుధవారం గోమాంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కరుగొండ సమీపంలో బొద్దాపుట్టు గ్రామంలో గర్భిణీ విజయ రెండవ కాన్పు నొప్పులు రావడంతో అంగనవాడి టీచర్ రెండు కిలో మీటర్ల దూరంలో కొండపైకి వెళ్లి సిగ్నల్ పాయింట్ నుండి 108 అంబులెన్సుకు స మాచారం అందించారు. అంబులెన్సు సుమారు రెండు గంటల తరువాత కారుగొండ గ్రామానికి చేరుకోంది. రోడ్డు సదుపాయం లేక అంబులెన్సు కారుగొండ గ్రామంలోనే ఉండటంతో కుటుంబ సభ్యులు రెండు కిలోమీటర్ల దూరం వరకు డోలి మోత ద్వారానే నిండు గర్భిణీని అంబులెన్సులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పాలకులకు రోడ్డు సౌకార్యం కల్పించాలని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికి నేటికీ స్పందన లేదని గిరిజనులు వాపోయారు.

డోలిలో తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

మూర్ఛవ్యాధితో గర్భిణి మృతి

- రహదారి లేక డోలిమోత
- మార్గమధ్యలో మృత్యువాత
- ప్రభుత్వమే బాధ్యత వహించాలి : సిఐటియు, గిరిజన సంఘం

ప్రజాశక్తి-కొయ్యూరు

పిట్స్ వచ్చిన గర్భిణికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతి చెందిన సంఘటన కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ పరిధి కుమ్మర్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కుమ్మర్ల గ్రామానికి చెందిన గర్భిణి పాంగి (20) రోజాకు మంగళవారం పిట్స్ వచ్చింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు డోలి కట్టి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న డౌనూరు పిహెచ్‌సికి తీసుకొని వెళ్తుండగా, మార్గమధ్యలో పరిస్థితి విషమించి రోజా మృతి చెందింది. రహదారి సౌకర్యం ఉండివుంటే వాహనంలో తరలించి సకాలంలో వైద్యం అందించి ఉండేవాళ్లమని, రహదారి లేకపోవడం వల్లే తన భార్య మృత్యువాత పడిందని రోజా భర్త చంటి కన్నీరుమున్నీరయ్యాడు.

సిఐటియు, గిరిజన సంఘం నాయకుల పరామర్శ

రోజు మృతి చెందిన విషయం తెలుసుకున్న సిఐటియు, గిరిజన సంఘం నాయకులు కుమ్మర్ల గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు మాట్లాడుతూ రోజా మరణానికి ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మారుమూల గిరిజన గ్రామాలకు నేటికీ రోడ్లు లేక గర్భిణులు, బాలింతలు, అనారోగ్యానికి గురయ్యేవారికి డోలి మోతలు తప్పడం లేదని, ఇలాంటి సమయాల్లో సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. కుమ్మర్ల గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని అనేక మార్లు విన్నవించుకున్నా ఐటిడిఎ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. అందువల్ల రోజా మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే ఆమె కుటంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రోజా భర్త చంటికి ఉద్యోగం కల్పించాలని, గ్రామానికి రహదారి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండలి కమిటీ సభ్యులు కొర్ర చిన్నా, మర్రి వెంకటరావు, గెమ్మిలి సాన సోమయ్య, తాంబేలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఐటియు, గిరిజన సంఘం నేతలు

డిజిటల్ క్లాస్ రూమ్‌లు సిద్ధం చేయండి

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: నాడు నేడు మొదటి విడత పనులు పూర్తైన పాఠశాలలలో డిజిటల్ క్లాస్ రూములను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, గిరిజన సంక్షేమ, ఇంజినీరింగ్, డిఆర్డిఎ అధికారులు, ఎమ్పిడిఓలతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టివిలు, ఉన్నత పాఠశాలలకు ఇంటరేక్టివ్ ఫ్లాట్ పేనల్స్ ప్రభుత్వం అందిస్తుందని, అందుకు తగిన ఇంటర్నెట్ కనెక్టివిటి, ఎలక్ట్రికల్ కనెక్టివిటీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధిత ప్రదానోపాధ్యాయులు భాద్యత వహించాలని తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో పంపిణీ చేయాలని, బూట్ల సైజులో హెచ్చు తగ్గులుంటే వెంటనే యాప్‌లో అప్లోడ్ చేసి వాటిని రిప్లేస్ చేయాలని ఆదేశించారు. యూనిఫాం మెటీరియల్ కుట్టించడానికి మండలాల వారీగా టైలర్లను గుర్తించి వెంటనే పనులు అప్పగించాలన్నారు. విద్యార్థులు పాఠశాలలకు యూనిఫారంలో హాజరు అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఎంఇఓ, ఎటిడబ్ల్యుఓ, ఎంపిడిఓ, ఎపిఎం లు కమిటీగా మండల స్థాయి స్టోర్ పాయింట్‌కు వచ్చిన జగనన్న విద్యా కానుక కిట్లను వెంటనే సంబందిత పాఠశాలలకు పంపించడంతో పాటు వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పంపిణీలో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించిన ప్రధానో పాధ్యాయులను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయులు బయో మెట్రిక్ హాజరు వేయాల్సిందేనని స్పష్టం చేసారు. నాడు-నేడు పనులలో నాణ్యత పాటించాలని, ముఖ్యంగా మేజర్ అండ్ మైనర్ మరమ్మత్తును జూలై పదవ తేదీ లోపు, విద్యుత్ పనులు జూలై 15, టాయిలెట్ల పనులను 20వ, తాగు నీటి పనులను 25వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా విద్యుత్, తాగు నీరు, టాయిలెట్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఎంపిడిఓలు తరచూ సమీక్షలు నిర్వహించి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షలో సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం భాష, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కొండలరావు, డిఆర్డిఎ పిడి వి.మురళి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఎటిడబ్ల్యుఒలు, ఎంఇఒలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గర్భిణి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఐద్వా జిల్లా అధ్యక్షులు జయ

మాట్లాడుతున్న జయ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: గర్భిణీ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఐద్వా జిల్లా అద్యక్షులు వివి జయ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అరకులోయ ఏపీ ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మూలపేట పంచాయతి కుంబుర్ల గ్రామంలో 45 కుటుంబాలు, 230 మంది గిరిజనులు జీవిస్తున్నారన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదన్నారు. మంగళవారం గర్భిణీ స్త్రీ కొర్ర రోజా (22) పురిటి నొప్పులు రావడంతో డోలి మోతతో ఆసుపత్రిలో తీసుకెళ్తుండగా మార్గంలో మృతి చెందడం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణం ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామంలో రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాషా వాలంటరీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.కుమారి, ఐద్వా మండల సెక్రటరీ శశికళ, మండల కమిటి సభ్యులు సన్యాసమ్మ పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించ వలసిన బాధ్యత తల్లిదండ్రులదేనని కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు చెప్పారు. మండలంలోని కొర్రాయా పంచాయతీ గత్తర జిల్లెడ ఎంపీపీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులు బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా విద్యా కానుక కిట్లును పంపిణి చేస్తుందన్నారు. వీటిని ఉపయోగించి గిరి విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ పెద్దలు కే.గిరిబాబు, కే.దోన్ను, కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న సర్పంచ్

భోజనం పెట్టాలని వేడుకుంటున్న విద్యార్థులు

ఆకలితో విద్యార్థులు

అమలు కాని మధ్యాహ్న భోజన పథకం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బోడిగపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వారం రోజులుగా అమలుకు నోచుకోలేదు. మండలంలోని రంగశీల పంచాయతీ బోడిగపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత వారం రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్ట లేదు. ప్రతిరోజు ఉపాధ్యాయుడు విధులకు వస్తున్నారు. కానీ, పిల్లలకు మధ్యాహ్న భోజనం ఎందుకు ఇవ్వలేదని పలువురు తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు ఉపాధ్యాయుని ప్రశ్నించగా ఏమీ సమాధానం చెప్పలేదని వారు తెలిపారు.వారం రోజులుగా విద్యార్థులు ఆకలితోనే ఇంటికి పరుగులు తీస్తున్నారు.

ఎంఇఓ వివరణ

మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ బాబురావును వివరణ కోరగా.. అన్ని పాఠశాలలోని ఎలిమెంటరీ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు అవుతుందని తెలిపారు. బోడిగపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో భోజనం ఇవ్వలేదన్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఈ విషయంపై వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని ఎంఈఓ తెలిపారు.

స్కూల్ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-పాడేరు:జి-20 కార్యక్రమాలలో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆల్ ఇండియా స్కూల్ క్విజ్ పోటీలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తోందని జిల్లా లీడ్ మేనేజర్ రవితేజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లాలో మండల స్థాయి పోటీలను నిర్వహించామన్నారు. జిల్లాలోని 22 మండలాల నుండి 142 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని, అందులో 17 బృందాలు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఒక్కో బృందంలో ఇద్దరు విద్యార్థులు ఉంటారని, మొదటి బహుమతి కింద ఐదు వేలు, రెండవ బహుమతి నాలుగు వేలు, మూడవ బహుమతి మూడు వేల నగదు బహుమతి వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని రవితేజ వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 28న పాడేరులో జరుగనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని, జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జూలై నెలలో విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- హుకుంపేట:అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మర్కెండేయులు మండల కేంద్రంలో మృతి చెందారు.ఉపాధ్యాయుడు కొర్రా. మార్కండేయులు (42) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. హుకుంపేట మండలం చీకటిపుట్టు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ జేఏసీ సంఘం ద్వారా పలు ఉద్యమాలు చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యలపై పెబర్టీయ యూనియన్ నాయకుడుగా ఎన్నో సేవలు అందించారు. ఆయన మృతికి పలువురు నాయకులు, ఉపాధ్యాయులు. నివాళులర్పించారు.

ఏఎల్‌పురంలో అపారిశుధ్యం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది. గ్రామంలోని వీధుల్లో చెత్త కుప్పలు, కాలువల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ముఖ్యంగా బీసి కాలనీ, వినాయక వీధి, గొల్లపేట, ఎస్సీ కాలనీ తదితర ఏ వీధి చూసినా డ్రైనేజ్ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. చెత్త కుప్పలు రోడ్లకు ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. దీంతో, గ్రామంలో మురుగునీరు ఎటుపోలేని దుస్థితి నెలకొంది. రహదారులు, ఇంటి ముందు కాలువల్లో మురుగునీరు నిల్వలు ఉండిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో దోమల బెడద విపరీతంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో చెత్తను, కాలువల్లో పూడికను తొలగించాలని కోరుతున్నారు.

క్వారీని నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - రావికమతం:మండలంలో కవగుంట గ్రామపంచాయతీ పట్టాలమ్మ తల్లి గుడి సమీపంలో క్వారీ బ్లాస్టింగులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రావికమతం నుంచి ఘాటి రోడ్డుకు వెళ్లే రోడ్డు మార్గం సమీపంలో ఈ క్వారీ ఉండటంతో బ్లాస్టింగ్ రాళ్ళు తమపై పడతాయేమోనని పాదచారులు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. క్వారీ దుమ్ము ధూళితో పంటలు సర్వనాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌తో కవగుంట గ్రామ ఇల్లులు బీటలు వారుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో మూగజీవులకు మేత దొరకని పరిస్థితి నెలకొందన్నారు.

3న గురుపౌర్ణమి ఉత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక షిరిడి సాయి మందిరంలో జూలై 3న గురు పౌర్ణమి సందర్భంగా మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని షిరిడి సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు కర్రి రామ్ గోపాల్ వెల్లడించారు. బుధవారం ఏర్పాట్లపై కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సేవా సమాజ్ అధ్యక్షుడు రామ్ గోపాల్ మాట్లాడుతూ, జూలై 3న కాగడా హారతి, నిత్య పూజ, హోమం, అభిషేకములు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. షిరిడి సాయి మందిరంలో మండప నిర్మాణంకు విరాళాలు అందించవచ్చని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వి రామచంద్ర రాజు, లంక శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 22న ఉదయం 8:30 గంటలకి గొలుగొండ మండలం ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలి

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రామారావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ. 600 ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మాడగడ పంచాయితీ దొరగుడలో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కూలీలకు గుణపాలు, గంపలు, గొడ్డలి, పార అందించాలని డిమాండ్ చేశారు. పని దినాలు పెంచితే వలసలు తగ్గుతాయని, 18 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా సాధించుకున్న ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ఉపాధి హామీ పథకంకు కేంద్ర ప్రభుత్వం నిధులను బడ్జెట్లో తగ్గించడం సమంజసం కాదని అన్నారు. తక్షణమే ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఎస్ దామోదర్, ఎస్.నాగేష్, ఎస్.రామ్మూర్తి, ఎస్.నారాయణ, ఎస్.గణేష్, ఎస్.పద్మ, ఎస్.జమున, ఎస్ దోని, ఎస్‌రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు

గాయపడిన హాస్టల్ వర్కర్‌ను పరామర్శిస్తున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఏజెన్సీ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పని చేస్తున్న హాస్టల్ వర్కర్స్‌కు భద్రత కల్పించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అరకువేలి గురుకులం కళాశాల వసతి గృహంలో కార్మికుడు బుద్ధు వంట చేస్తుండగా ప్రమాదవస్తు గాయపడ్డాడు.

ఈ విషయం తెలుసుకున్న ఉమామహేశ్వరరావు మంగళవారం గాయపడి అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడి బుద్దుని పరామర్శించారు. హాస్టల్స్‌లో పని చేసే కార్మికులకు ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు న్యాయపరమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని అనేక ఉద్యమాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్‌లో నిబంధనలు సడలించి గిరిజన ఆశ్రమ, గురుకులాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని తక్షణం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుడు బుద్దుకు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలన్నారు.

సాంకేతిక లోపంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం

కార్యాలయంలో క్యూలో క్రయవిక్రయదారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:సాంకేతికంగా లోపంతో ఈ కేవైసీ కాక పోవడంతో క్రయవిక్రదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో బుధవారం భూములు, ఇంటి స్థలాలు, తదితర స్థలాల రిజిస్ట్రేషన్‌కు అధిక సంఖ్యలో క్రయవిక్రదారులు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సాంకేతిక లోపం కారణంగా సాయంత్రం 3.30 గంటల వరకు ఈ కేవైసీ నమోదు కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయి. ఆ తర్వాత ఒక గంట పని చేసి మరలా సాంకేతిక లోపం తలెత్తడంతో రిజిస్ట్రేషన్లు ఆగి పోయాయి. క్రయ విక్రయదారులు గంటల కొద్దీ క్యూ లైన్‌లో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రేషన్లకు కార్యాలయం వద్ద పడిగాపులు గాచారు. తరచూ ఇటువంటి సమస్యలు తలెత్తుతుంటే రిజిస్ట్రేషన్లు ఎలా చేయించుకోవాలని క్రయవిక్రదారులు ఆవేదన చెందుతున్నారు.

కొత్త వరి విత్తనాలు వేసుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:రైతులు ప్రత్యామ్నాయంగా కొత్త రకాలు వరి విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలోని బుధవారం కాగిత, గుల్లిపాడు రైతు భరోసా కేంద్రాలను క్షేత్ర పర్యటన చేశారు. వరిలో విత్తన శుద్ధి ఆవశ్యకతను రైతులకు వివరించారు. విత్తన శుద్ధితో తెగుళ్ళ బారి నుండి రక్షించవచ్చునన్నారు.వరిలో కొత్త రకాలైన స్వర్ణ కి ప్రత్యామ్నాంగా ఎంటియు 1318, సాంబకి ఎంటి యు 1224, ఆర్‌జిఎల్ కి ఎంటియు 1061 (ఇంద్ర), ఎంటియు 1064 (అమర) వంటి కొత్త రకాలను రైతులు ఎంచుకోవాలన్నారు.వీటితో తెగుళ్ళు, చీడలు నియంత్రణ ఖర్చులు తగ్గడం తో పాటు అధిక దిగుబడులు పొందవచ్చునని అన్నారు.

కుష్టు వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి-మాడుగుల: కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే సమగ్రంగా చేపట్టాలని కేజే పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ప్రసాదు పాత్రుడు, లీలా ప్రసాద్ సూచించారు. ఈ నెల 26 నుండి జూలై 16వ తేదీ వరకు జరగనున్న సర్వేలో ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నివేదిక అందజేయాలని కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాలు ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం విస్తరణ అధికారి రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతరకు 'పైలా' విరాళం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని తాటిపర్తి పంచాయతీ చిన్న కూర్మనాధపురం గ్రామంలో నిర్వహిస్తున్న మోదమాంబ జాతరకు టిడిపి నేత పైలా ప్రసాదరావు పది వేల రూపాయల విరాళం అందించారు. గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించి అనంతరం నగదును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంతల అప్పారావు, ఆళ్ళంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమ రవాణాపై నిఘా

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేసే వారిపై ఉక్కు పాదం మోపాలని తహసిల్దార్ జానకమ్మ తెలిపారు. బుధవారం రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుండి మట్టి, ఇసుక అక్రమంగా రవాణా అవుతున్న విషయం పలు గ్రామాల నుండి ఫోన్ల ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అక్రమంగా రవాణా జరుగుతున్న గ్రామాలలో నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు.ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో అందజేయాలన్నారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల పట్ల రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డుదారులందరికీ వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీవో కాశి విశ్వనాథరావు ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీ సమావేశ మందిరంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి 272 రూపాయలు వేతనం అందే విధంగా పనులు కల్పించాలన్నారు. ఉద్యానవన పనులతో పాటు ఫిట్టింగు ప్లాంటింగ్ పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి పనుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా కూలీలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గంగు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు పత్రాలతో లాభం

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని జైతివరం గ్రామంలో కౌలు రైతులకు మండల వ్యవసాయ అధికారిని ఏ.కృష్ణవేణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూమి లేని కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు పత్రములను ఇస్తున్నట్లు తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర తోపాటు, రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులను పొందుటకు ఈ కౌలు పత్రము ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి కే.గౌరీ శంకర్, గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ పశుసంవర్ధక సహాయకులు మార్తా శ్రీనివాస్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

ప్రజాశక్తి -అడ్డతీగల : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది సర్పంచులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే నాథుడు కరువయ్యాడు. పంచాయతీరాజ్ కార్యాలయం నుండి ఒక్క అధికారి కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో పంచాయతీరాజ్ గ్రామీణ మంచినీటి సరఫరా కార్యాలయం నుండి సమాధానం రాకపోవడంతో సర్పంచులు ఎంపిటీసీలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీలోనూ ఇంటింటికీ పైప్ లైన్లు నడిపేరే తప్ప ఇక్కడ మంచినీళ్లు మాత్రం రావట్లేదు అని ప్రజాప్రతినిధులు అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో బాపన్న దొర సంబంధిత అధికారులను ప్రశ్నించిన సరియైన సమాధానం రాలేదు. గత నాలుగు సంవత్సరాలుగా మండల సర్వసభ్య సమావేశంలో ఏవైతే సమస్యలున్నాయో అవే తిరిగి ప్రశ్నిస్తున్నారు తప్ప పరిష్కారం అయ్యే మార్గాలు మాత్రం కనిపించడం లేదు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు ఉన్నతమైనటువంటి ప్రభుత్వ అధికారులు నాయకులు దష్టి సారించాలని మరికొందరు కోరుచున్నారు. ఎంపిపి బొడ్డపాటి రఘువ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, ఎంపిడిఓ బాపన్నదొర, తహశీల్దారు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 900 బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లు

బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పాల్ విలియం

పాల్ విలియం

ప్రజాశక్తి -సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో 900 బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లు ఏర్పాటు చేయడానికి ప్రక్రియ పూర్తి చేసామని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్ వెల్లడించారు. బుధవారం సీలేరులో విస్తృతంగా పర్యటించి ఆయన బిఎస్ఎన్ఎల్ టవర్లు సిగ్నల్ పనితీరు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బోర్డులు తదితర సామాగ్రిని పరిశీలించారు. వినియోగదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నెట్వర్క్ నిరంతరం ఉండేలా చర్యలు చేపట్టాలని డీఈ రాజకుమార్ ఆదేశించారు. నెట్వర్క్ లో సాంకేతిక పరమైన సమస్యల్ని సిబ్బందిని అడిగి ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ టవర్లు ఏర్పాటుకు బేస్మెంట్ లెవల్ పనులు కూడా ప్రారంభించామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ కల్లా 4జి టవర్లు 500 పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న 3జి టవర్లను 4జిగా మార్చడానికి అన్ని చర్యలు చేపట్టేమన్నారు. ఫైబర్ నెట్వర్క్ సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. అల్లూరి జిల్లాలో 1700కు పైగా వినియోగదారులకు ఫైబర్ నెట్ కనెక్షన్ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. బిఎస్ఎన్ఎల్ సేవలో కొంత సాంకేతికపరమైన సమస్యలు ఉన్నాయని అవి అధిగమించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిఈ రాజ్ కుమార్ ఎఇఇ. భగవాన్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు రామకృష్ణ ప్రింటర్స్ లైన్‌లో బుధవారం భారీ చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టు పడిపోయిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అధికారులు స్పందించి చెట్టును తొలగించి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

చింతూరులో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన ర్యాలీ

కొయ్యూరులో యోగాభ్యసన

ప్రజాశక్తి- చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిక్షణ, అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ జి.హారతి, అధ్యాపకులు జి. వెంకటరావు, అప్పనమ్మ, శకుంతల, శైలజ, నాగమోహన్ రావు, రాజబాబు, శ్రీదేవి, రమేష్, సాయికుమార్, ఇమ్మానియేలు, అలివేలు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా ఉపాధ్యాయులు జే.వెంకట గిరిబాబు, డీ.వెంకటగిరి ఆధ్వర్యంలో పోలీసు గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, సీఐ ఏ.స్వామినాయుడు, ఎస్సై రాజారావు యోగాభ్యాసం చేశారు. రోజువారీ దిన చర్యలో యోగా ఓ భాగం కావాలని తహసీల్దార్, సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో యోగ డే సెలబ్రేషన్స్ ప్రిన్సిపాల్ అరుణ కుమారి, రంపచోడవరం ప్రిన్సిపాల్ రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థిని విద్యార్థులు వేసిన యోగాసనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు. వ్యాయామ ఉపాధ్యాయుడు దూడ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లలో యోగా దినోత్సవంలో విభిన్న ఆసనాలు వేస్తున్న విద్యార్థులు, ఏకలవ్య పాఠశాల సిబ్బంది

జూ పార్కులో జంతు ఆరోగ్య కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : జూ పార్కులోని జంతువుల శ్రేయస్సు, ఆరోగ్యానికి సంబంధించిన అజెండా, వివిధ అంశాలు చర్చించేందుకు బుదవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో జంతు ఆరోగ్య కమిటీ సమావేశం నిర్వహించారు. జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా అధ్యక్షతన జరిగిన సమావేశానికి జూపార్కు అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నవీన్‌కమార్, నెహ్రూ జులాజికల్ పార్కు రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో సీనియర్ వెటర్నరీ వైద్యుల బృందం పాల్గొంది. జంతువుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడం, వాటి శ్రేయస్సు కోసం తీసుకోవలసిన చర్యలు, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, పశువైద్య చికిత్స పలు అంశాలపై చర్చించారు. అనంతరం కమిటీ సభ్యులం దరూ జూలో అన్ని జంతువుల ఎన్‌క్లోజర్లను సందర్శించి, వాటి ప్రవర్తనను నిశతంగా పరిశీలించారు. సమావేశంలో డాక్టర్ ఫణీంద్ర, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి. గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ అఫీసర్లు రాజేశ్వర్రావు, భారతి, జూనియర్ వెటర్నరీ డాక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- సింహాచలం: పాత గోశాల నుంచి అడవివరం వరకు బిఆర్‌టిఎస్ కారిడార్‌లో ఇళ్లు, ఇతర ఆస్తులను కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం కార్పొరేటర్, జివిఎంసిలో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. ఈ మేరకు జివిఎంసి కమిషనర్‌ను కలిసి, నాలుగు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యంగా ఇళ్లస్థలాలు కోల్పోయే వారికి మార్కెట్ ధర ప్రకారం ఐదు టిడిఆర్‌లు ఇవ్వాలని, ప్రతి నిర్వాసిత కుటుంబానికీ మూడు సెంట్లు ఇంటి స్థలం 98వ వార్డు పరిధిలోనే ఇవ్వాలని, నిర్వాసితులు భవన నిర్మాణ విలువతో పాటు నష్టపోతున్న చెట్లు, ఇతర ఆస్తులకు నష్టపరిహారం చెల్లించాలని, రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయి, తిరిగి అడివివరం ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకునే వారికి సింహాచల దేవస్థానం, జివిఎంసి ఎలాంటి ఆంక్షలు విధించకుండా ముందుగా అనుమతులు ఇవ్వాలని, అలాగే వీరు నూతనంగా నిర్మించుకునే ఇళ్లకు జివిఎంసి ప్లాన్ అనుమతుల రుసుం మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. నిర్వాసితులకు ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా పనులు చేయడం తగదన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

రంపచోడవరం, చింతూరులో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై వాలంటీర్లకు గృహ సారథులు, సచివాలయం సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీకే వీధి మండల ఇఓపిఆర్‌డి పాపారావు, మాట్లాడుతూ గడపగడపకి వాలంటీర్లు గృహసారథులు వెళ్లి ప్రజల సమస్యలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు పరిష్కారం కాని సమస్యలు వారి సమక్షంలో ప్రజలు కుల ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వ పథకాలు అందజేసే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఇన్చార్జి సర్పంచ్ కే వల్లి ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని తామరపల్లి సచివాలయంలో బాధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, ముసురిమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో జారీ చేసే సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. కుల, నివాస, వివాహ, డెత్, మ్యుటేషన్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నెంబర్ అప్డేట్, కొత్త రేషన్ కార్డు నమోదు, కౌలు గుర్తింపు కార్డులు వంటివి ఫీజు లేకుండా ఉచితంగా అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్, ఐటిడిఏ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకళ, సచివాలయం సిబ్బంది, వాలంటర్స్ తదితరులు పాల్గొన్నారు

కొండవాలులో సహాయక చర్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార: రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇళ్లల్లోకి మట్టి, వర్షపు నీరు చొరబడిన 48వ వార్డు శ్రీనివాస్ నగర్, బాపూజీ నగర్, జై భారత్ నగర్, ఇందిరానగర్ -1,3,5 ప్రాంతాలలో స్థానిక వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో బిజెపి ఫ్లోర్‌లీడర్ గంకల కవిత అప్పారావు బుధవారం సందర్శించారు. సమస్య తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమిచ్చి, సంఘటనాస్థలికి చేరుకుని, బాధితులతో మాట్లాడి వారి కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రౌండ్‌ది క్లాక్ మంచినీటి సరఫరాకు పైపులైన్ వేసేందుకు తవ్విన గోతుల వల్ల, వర్షం కురిసినప్పుడు కొండవాలు ప్రాంతంలోని నీరంతా ఇళ్లల్లోకి చొరబడిందని, మట్టిపేరుకుపోవడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తానే సొంతంగా ఎనిమిది ట్రాక్టర్లతో మట్టిని తెప్పించి, గోతులను పూడ్చే చర్యలు చేపట్టారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణగోడ నిర్మాణం చేపట్టడం ద్వారా సంబంధిత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులను కోరనున్నట్లు తెలిపారు. గుడ్‌మార్నింగ్ గంకలతో వార్డు పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పేదవిద్యార్థుల కాలేజీ ఫీజుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణతలైన పేద విద్యార్థులకు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎన్ఐఎఫ్ఎస్‌సి. ఇఒ సునీల్ మహంతి బుధవారం ఆర్థికసాయం అందించారు. విశాలాక్షినగర్ బివికె కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకునేందుకు 12మంది పేదవిద్యార్థులకు అవసరమైన ఫీజును తన సొంత నిధుల నుంచి చెక్ రూపంలో ద్వారకానగర్ బివికె.కళాశాల ప్రిన్సిపాల్ జోగిరాజు, కరస్పాండెంట్ శ్రీధర్‌లకు అందచేశారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కాకుండా ఏటా కొంతమందికి ఇలాగే తాను ఫీజు చెల్లిస్తు న్నానన్నారు. అలాగే.బాస్కెట్‌బాల్ క్రీడలో ఆసక్తి కనబరు స్తున్న కొందరు క్రీడాకారులకు కూడా తాను ఆర్థికసాయం అందించి చదివిస్తున్నాన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భూషణరావు పాల్గొన్నారు.